Quraani Qisse
(Telugu)

ఖురానీ గాధలు

మూలం:

మౌలానా అబూ సలీం అబ్దుల్ హై

అనువాదం:

షేఖ్ హమీదుల్లా షరీఫ్ బి.ఏ.

ముందు మాట

సకల లోకాధీశ్వరుడు, సర్వస్తోత్రాలకు అర్హుడు అయిన అల్లాహ్ అమృత మయుడు; మధుర ప్రేమమూర్తి; అందరి సృష్టికర్త; యజమాని; ఆరాధ్య దైవం, మన కోసం మనమంతా సుఖవంతంగా, సౌభాగ్యవంతంగా బ్రతకటానికి అల్లాహ్ చేసిన ఏర్పాట్లు అపూర్వమైనవి. పుట్టిన దగ్గర నుంచి ఈ లోకాన్ని వదలిపోయే వరకు, మనం ఎలా జీవించాలో, ఎందుకు అలా జీవించాలో, అసలు మన జీవిత లక్ష్యం ఏమై ఉండాలో విపులంగా, వివరంగా తెలియజేశాడు. ఆయన మనకు చేసిన ఈ మహోపకారానికి, మనం హృదయపూర్వకంగా, అంటే ఆయన చెప్పిన విధంగా మన జీవితాలను తీర్చిదిద్దుకుని కృతజ్ఞతలు తెల్పుకోవాలి.

అన్ని కాలాల్లో, అన్ని దేశాలకు దైవప్రవక్తలు వచ్చారు. దైవ ధర్మాన్ని, దైవ సిద్ధాంతాన్ని ప్రజలకు బోధించారు. దైవాజ్ఞలకనుగుణంగా జీవిస్తే, ఇహపర లోకాల్లో సుఖశాంతులు, ముక్తిమోక్షాలు సంప్రాప్తమవుతాయని ప్రచారం చేశారు. తాము ప్రజలకు బోధించిన ప్రతి విషయాన్ని స్వయంగా ఆచరించి చూపారు. ఆ విధంగా దైవ సందేశాన్ని మానవాళికందజేసిన ఎంతో మంది దైవప్రవక్తల్లో హజ్రత్ ముహమ్మద్ (స) కూడ ఒకరు; ఆయనే చివరి దైవప్రవక్త. ఆయనపై అవతరించిన చివరి దైవ గ్రంథమే పవిత్ర ఖుర్‌ఆన్. అంటే ఇక ముందు దైవప్రవక్తలు రారు, దైవ గ్రంథాలూ అవతరించవు అని అర్థం. కనుక మానవులందరికీ, కుల, మత, జాతి, వర్గ, వర్ణ విభేదాలు లేకుండా, ప్రళయ కాలం వచ్చేవరకు, పవిత్ర ఖుర్‌ఆన్ ప్రబోధాలు, హజ్రత్ ముహమ్మద్ (స) ఉపదేశాలు, ఆచరణలు శిరోధార్యాలు.

పవిత్ర ఖుర్‌ఆన్ అరబ్బీ భాషలో పదునాలుగు వందల సంవత్సరాలకు పూర్వం అవతరించింది. దైవానుగ్రహం వల్ల అది ఇప్పటికీ తన నిజ స్వరూపంలో ఏ విధమైన మార్పులు, చేర్పులు లేకుండా ఉంది. ప్రళయ కాలం వచ్చే వరకు ఉంటుంది. కాని ప్రస్తుతం చెలామణిలో ఉన్న ఇతర మత గ్రంథాల్లా, పవిత్ర ఖుర్‌ఆన్ కూడా ఒక మత గ్రంథమనీ, కేవలం ముస్లిములకే అది పరిమితమై ఉన్నదని ఒక అతి ఘోరమయిన, అత్యంత ప్రమాదభరితమయిన అపార్థం లోకంలో పరివ్యాప్తమై ఉంది. ఈ అపార్థానికి, ఈ దుష్ప్రచారానికి అసలు కారణం, ఈ గ్రంథాన్ని నిష్పాక్షిక దృష్టితో, నిర్మల హృదయంతో చదివి అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయకపోవటమే కాని స్వయంగా కృషి చేసి నిజాన్ని గ్రహించటం మానవ ధర్మం.

పవిత్ర ఖుర్ఆన్‌లో ఉన్న ఎన్నో మహత్తర విషయాలు ప్రజాబాహుళ్యానికి అందకపోవటానికి, "ఈ గ్రంథాన్ని మేము విశ్వసించాం" అనేవారు కూడా చాలా వరకు కారణభూతులే. దాన్ని పరమ పవిత్రమైన దైవ గ్రంథంగానయితే వారు ఆదరిస్తారు, కాని దురదృష్టవశాత్తు, అది చెప్పే విధంగా ఆచరించరు, జీవించరు. ఈ దైవ చట్టాన్ని కేవలం మస్జిద్ ప్రాంగణానికి, లయబద్ధంగా, మధురాతిమధురంగా పారాయణం చేసుకోవటానికి, కంఠస్థం చేయటానికి, తావీజులు కట్టటానికి మాత్రమే పరిమితం చేసి అది ఇచ్చే సందేశాన్ని మరుగున పడవేశారు. కనుకనే ఈనాడు ప్రపంచంలో అధర్మం, అన్యాయం, దౌర్జన్యం, అరాచకం, అశాంతి, కల్లోలం విలయతాండవం చేస్తున్నాయి.

మానవాళికి ఆచరణయోగ్యమైన ఒక సంపూర్ణ జీవిత విధానాన్ని ఉపదేశిస్తోంది పవిత్ర ఖుర్ఆన్. మానవ జీవితానికి సంబంధించిన- అంటే, వ్యక్తిగత, సామాజిక, నైతిక, భౌతిక, ఆధ్యాత్మిక, ఆర్థిక, రాజకీయ విషయాలన్నీ దానిలో ఉన్నాయి. ఆ విధానాన్ని నిత్యజీవితంలో ఆచరించి ఇహపర లోకాల్లో అమర సౌఖ్యాలను పొందమని మానవులందర్నీ ఖుర్ఆన్ ఆహ్వానిస్తోంది. ఖుర్ఆన్ దృష్టిలో పరలోక సాఫల్యానికి ఇహలోక ఆరోహణ సోపానం, అంటే పరం కోసం ఇహాన్ని పరిత్యజించవలసిన పనిలేదు. ఇహం ద్వారానే పరం ప్రాప్తిస్తుంది. లోకంలో ఏ విధంగా జీవించాలో, దాన్ని ఎలా అనుభవించాలో తెలియక పాప భూయిష్టమని, సంసారం దుఃఖసాగరమని అడవుల్లోకి, కొండల్లోకి పరుగెత్తే బలహీనులకు, మూఢులకు పవిత్ర ఖుర్ఆన్ రుజుమార్గం, నిజధర్మం బోధిస్తుంది.

రుజు మార్గం తప్పి దైవోపదేశాలను, దైవ హెచ్చరికలను త్రోసిపుచ్చిన మానవ సమాజాలు పూర్వం ఏ విధంగా పతనమయ్యాయో "ఖురానీ గాథలు" మనకు కళ్ళకు కట్టినట్లుగా తెలుపుతాయి. మానవులకు దైవాజ్ఞల్ని ఉల్లంఘిస్తే చరిత్ర పునరావృతమవుతుందని దైవం చేసిన హెచ్చరికలే ఈ యదార్థ గాథల ద్వారా పిన్నలు, పెద్దలు అందరూ సమంగా గుణపాఠాన్ని గ్రహిస్తారనీ, తమ జీవితాలను దైవ బోధల కనుగుణంగా తీర్చిదిద్దుకుంటారని ఆశిస్తున్నాము.

మనందర్నీ చివరికి దైవ ప్రవక్త ముహమ్మద్ (స) చూపిన మార్గంపై దైవం నడిపించుగాక!

– ప్రకాశకులు

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

ఏనుగులవాళ్ళు

మీరంతా కాబా పేరు వినే ఉంటారు. ఎన్నో విధాలుగా ప్రసిద్ధి చెందింది అరేబియా దేశంలోని మక్కా నగరం. చారిత్రక ఖ్యాతిగల ఈ మహానగరంలో, నాలుగు వేల అయిదు వందల సంవత్సరాలకు పూర్వం, దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్(అలై) దైవ ప్రార్థన చేయటానికి నిరాడంబరమయిన ఒక కట్టడాన్ని నిర్మించారు. ఈ పవిత్రమయిన ప్రార్థనామందిరం పేరే కాబా. పవిత్ర కాబా ఉన్న దిక్కుకే తిరిగి మనమంతా నమాజ్ చేస్తాము.

అంతిమ దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) జననానికి పూర్వం కూడా అరబ్ దేశీయులు పవిత్ర కాబాను గౌరవ ప్రతిపత్తులతో చూచేవారు. పూజలు చేయటానికి; కాబా గృహాన్ని సందర్శించటానికి వారంతా మక్కా నగరానికి పోయేవారు. హజ్రత్ ముహమ్మద్ (స) పుట్టబోయే సంవత్సరంలో అక్కడ అత్యద్భుతమయిన ఒక సంఘటన జరిగింది. పవిత్ర కాబా భవనాన్ని విధ్వంసం చేయాలనే దుర్బుద్ధి పుట్టింది ఎమన్ దేశ చక్రవర్తి అబ్రహాకు. ఆ రాజు క్రైస్తవ మతస్థుడు. అతడు తన రాజధాని నగరంలో ఒక పెద్ద చర్చిని కట్టించాడు. క్రైస్తవులంతా ఒక చోట సమావేశమై ప్రార్థన చేసే స్థలాన్ని చర్చి అంటారు.

ఎమన్ చక్రవర్తి కట్టించిన చర్చి చాలా అందమయింది, ఎత్తయినదీను. అరబ్ దేశీయులంతా కాబా మందిరానికి పోవడంమాని, ఈ చర్చిని సందర్శించటానికి వస్తారని ఆశించాడు అబ్రహా. అసలు ఈ చర్చి నిర్మాణం వెనుక దాగి ఉన్న ఉద్దేశం కూడా ఇదే. తన ఈ లక్ష్యాన్ని సాధించటానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు ఆ రాజు. కాని ప్రజలు పవిత్ర కాబాకు పోవడం మానుకోలేదు. నిరాశ చెందిన అబ్రహా హృదయంలో అసూయాజ్వాలలు చెలరేగాయి. దురాశకు లోనయిన ఆ రాజు దురాలోచనలు చేయసాగాడు.

దైవ గృహమైన పవిత్ర కాబానే కూల్చివేయాలని నిర్ణయించాడు. కాబా భవనాన్ని రూపుమాపితే, ప్రజలంతా తండోపతండాలుగా తాను నిర్మించిన చర్చి సందర్శనార్థం వస్తారని పగటి కలలు కన్నాడు ఆ రాజు. ఈ విధంగా అతడు కుట్ర పన్ని, ఒక పెద్ద సైన్యాన్ని సమాయత్తం చేశాడు. ఆ మహా సైన్యాన్ని తీసుకుని కాబా దండయాత్రకు బయల్దేరాడు ఏమన్ చక్రవర్తి. చాలా దూరం ప్రయాణం చేసి అలసిన అబ్రహా సైన్యం మక్కా నగరానికి సమీపంలో ఉన్న ఒక బయలు ప్రదేశంలో మజిలీ చేసింది. దైవభయం, క్రమశిక్షణ, విచక్షణా జ్ఞానంలేని అబ్రహా సైన్యం విశృంఖలంగా ప్రవర్తించ సాగింది. పరిసర ప్రాంతాల్లో మేత మేస్తూ ఉన్న మక్కావాసుల జంతువుల్ని పట్టుకున్నారు సిపాయిలు. ఈ జంతువుల్లో హజ్రత్ ముహమ్మద్ (స) తాతగారయిన అబ్దుల్ ముత్తలిబ్‌కు చెందిన రెండు వందల ఒంటెలు కూడా ఉన్నాయి. అబ్దుల్ ముత్తలిబ్ మక్కా నగరంలో పేరుగాంచిన పెద్ద సర్దారు. పవిత్ర కాబాకు సంబంధించిన వ్యవహారాలనన్నింటినీ ఆయనే చూస్తూ ఉండేవారు.

అబ్రహా చక్రవర్తి పెద్ద సైన్యంతో మక్కాపైకి దండెత్తి వచ్చాడన్న వార్త నగరమంతా వ్యాపించింది. మక్కా పౌరులు తీవ్రభయాందోళనలకు గురయ్యారు. నాయకులంతా ఒక చోట సమావేశమై చేయవలసిన పనిని గురించి, తీసుకోవలసిన చర్యలను గురించి సుదీర్ఘ సమాలోచనలు జరిపారు. అకస్మాత్తుగా దండెత్తి వచ్చిన ఏమన్ సైన్యాన్ని ఎదిరించి పోరాడే శక్తి, బలగం, ఆయుధాలు లేనందున నగరవాసులంతా సురక్షిత ప్రదేశానికి ప్రాణరక్షణ నిమిత్తం పారిపోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశమైన పెద్దలంతా, సంఘ పెద్దల నిర్ణయానుసారం, మక్కాకు సమీపంలో ఉన్న పర్వత శ్రేణుల్లోకి పారిపోయారు మక్కావాసులు. పరమ పవిత్ర దైవగృహమైన కాబాను ప్రచండ శత్రుబలాన్నుండి కాపాడేదెవరో!?

అబ్రహా దండెత్తివచ్చింది మక్కా ప్రజలతో యుద్ధం చేయటానికి కాదు. పవిత్ర కాబా భవనాన్ని భూస్థాపితం చేయటమే అతని దండయాత్ర ప్రధాన లక్ష్యం. కాబా వ్యవహారాలను చూస్తున్న అబ్దుల్ ముత్తలిబ్ వద్దకు అబ్రహా తన రాయబారిని పంపాడు. ఆ రాయబారి అబ్దుల్ ముత్తలిబ్‌తో, "నేను ఏమన్ రాజు పంపగా వచ్చిన దూతను. మా చక్రవర్తి మీతో యుద్ధం చేయడానికి

రాలేదు. కాబా మందిరాన్ని కూల్చటమే మా ప్రధానోద్దేశ్యం. మా ఈ కార్యక్రమంలో మీరు జోక్యం కలుగజేసుకోకుండా ఉంటే, మేము మీ దరిదాపులకు రాము. కాని, విఘ్నాలు సృష్టించి, ప్రతిఘటిస్తే మీకు మాకు తీవ్ర సంగ్రామం తప్పదని నేను మా చక్రవర్తిపరంగా హెచ్చరిస్తున్నాను" అన్నాడు.

అబ్రహా పంపిన రాయబారాన్ని విన్న ఆ వృద్ధ సర్దారు తొణకలేదు, బెణకలేదు. గంభీరవదనుడై ఆ రాయబారితో అన్నాడు, "మా నిర్ణయం కూడా ఇదే, మేము మీతో యుద్ధం చేయదలుచుకోలేదు. మీ సైన్యాన్ని ఎదుర్కొని పోరాడే శక్తిసామర్థ్యాలు మాకు లేవు. ఇక పవిత్ర కాబా విషయమంటారా, అది సర్వలోక పరిపోషకుడైన దేవుని ఇల్లు. దైవానికి అత్యంత ప్రియుడయిన హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) దాన్ని నిర్మించారు. తన ఈ పావన గృహాన్ని దేవుడు కలకాలం ఈ భూమిపై ఉంచదలిస్తే, దాని సంరక్షణార్థం కావలసిన ఏర్పాట్లు ఆయనే చేసుకుంటాడు. కాబాను గురించిన భయం మాకు ఏ మాత్రం లేదు."

ఈ సమాధానం విన్న అబ్రహా రాయబారి ఆశ్చర్యపడకుండా ఉండలేక పోయాడు. తనతోబాటు తమ విడిదికి వచ్చి చక్రవర్తిని చూడవలసిందిగా అబ్దుల్ ముత్తలిబ్‌ను కోరాడు. అబ్దుల్ ముత్తలిబ్ అందుకు అంగీకరించి, ఆ రాయబారితో అబ్రహా తన పరివారంతో విడిదిచేసిన ప్రదేశానికి వెళ్ళారు. ఎమన్ చక్రవర్తి ఆ ముసలి సర్దారును గౌరవ మర్యాదలతో ఆహ్వానించి, తనకు దగ్గరగా కూర్చోమన్నాడు.

వారిద్దరి మధ్య సంప్రదింపులు సుహృద్భావపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. అబ్దుల్ ముత్తలిబ్ తన సంభాషణలో పవిత్ర కాబాను గురించిన ప్రసక్తే తీసుకురాలేదు. అబ్రహా ఆశించినదానికి బదులుగా, వారు అబ్రహా సైన్యం పట్టుకున్న తన రెండు వందల ఒంటెలను తిరిగి తనకు ఇవ్వవలసిందిగా కోరారు. సంభ్రమాశ్చర్యాలకు గురియైన అబ్రహా చక్రవర్తి, "కాబా మందిరమంటే మీకు చాలా భక్తి, గౌరవం అని విన్నాను. దాన్ని మీరు మీ ప్రాణం కంటే కూడా ఎక్కువగా ఆదరిస్తారని మాకు తెలిసింది. నేను కాబాను పడగొట్టడానికి వచ్చిన విషయం మీకు తెలుసు. కాని మీరు ఆ విషయాన్ని గురించి ప్రస్తావించకుండా, మా సైన్యం మీ ఒంటెలను పట్టుకుందని

ఫిర్యాదు చేస్తున్నారు. ఈ మీ ప్రవర్తన మాకు నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది" అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్‌తో.

ఇది విన్న ఆ ముసలి అరబ్ అబ్రహాతో సావధానంగా అన్నారు, "ఓ చక్రవర్తీ! మీ సిపాయీలు పట్టుకున్న ఒంటెలు నా సొత్తు. కనుక నేను వాటిని నాకు తిరిగి ఇవ్వవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను. కాని కాబా నాది కాదు. అది దేవుని సొత్తు. దైవ మందిరం. దేవుడు తన ఇంటిని తానే స్వయంగా రక్షించుకుంటాడు. పవిత్ర కాబాను, దైవం ఇంకా భూమి మీద ఉంచదలిస్తే దాన్ని ఎవరూ తాకలేరు. కనుక ఆ పవిత్ర మందిరాన్ని కాపాడే భారం దేవునిదే."

అబ్దుల్ ముత్తలిబ్ ఒంటెలను తిరిగి ఆయనకు ఇవ్వవలసిందిగా తన సైన్యాన్ని ఆజ్ఞాపించాడు అబ్రహా. తన దురాక్రమణకు ఏ విధమైన అవరోధాలు లేవని ఆనందంతో ఉప్పొంగిపోయాడు ఆ క్రైస్తవ చక్రవర్తి. ఒంటెలతో తిరిగివచ్చిన అబ్దుల్ ముత్తలిబ్, తాను అబ్రహాతో జరిపిన సంప్రదింపుల సారాంశాన్ని మక్కా సర్దారులకు వినిపించారు. అబ్రహా నిర్ణయాన్ని విని వారంతా చాలా విచారించారు. కాని పవిత్ర కాబా సంరక్షణార్థం ఏమీ చేయలేకపోయారు. అబ్రహా సేనతో పోరాడి పవిత్ర కాబాను కాపాడే శక్తిసామర్థ్యాలు వారికి లేని మాట నిజమేకాని, పవిత్ర కాబా అంటే వారి హృదయాల్లో నిజమయిన భక్తి, ప్రేమ ఉన్నట్లయితే, ఎమన్ సైన్యంతో ఢీకొని కాబా కోసం ప్రాణత్యాగం చేసేవారు. వారు బలహీనులు, అసమర్థులే కాదు, పిరికి భక్తులు కూడ. నిజమైన భక్తికి, ప్రేమకు ప్రతిబింబం త్యాగం. పర్వత శ్రేణుల్లోకి పారిపోయే ముందు సర్దార్లంతా ఒక చోట సమావేశమై దైవాన్ని ప్రార్థించారు. "ఓ ప్రభూ! నీ పవిత్ర గృహాన్ని కాపాడే శక్తి మాకు లేదు. (మేము బలహీనులం) నీవే దీన్ని రక్షించుకో, నీవు అనుకూలించకపోతే, పవిత్ర కాబాను ఎవ్వరూ తాకలేరు. ఈ నీ పవిత్ర మందిరం నాశనం కావడమే ఒకవేళ నీ సంకల్పమైతే దాన్ని రక్షించటానికి మేమెంతవారం? ఏది నీ నిర్ణయమైతే అదే జరుగుతుంది."

మక్కా నగర వీధుల్లో జనసంచారం లేదు. ఎటు చూచినా నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. తమ తమ ప్రాణాలను రక్షించుకోవటానికి, ప్రజలంతా కొండ గుహల్లోకి పారిపోయారు. పవిత్ర కాబా మందిరాన్ని కూల్చటానికి మక్కా వైపునకు

పోసాగింది ఎమన్ సేన. మదంతో మత్తెక్కిన ఏనుగులు తొండాలను ఆడిస్తూ, ఘీంకరిస్తూ ఆ మహా సైన్యానికి ముందు నడుస్తున్నాయి. సాయుధులైన సిపాయిాల ఉక్కు పాదాల ధ్వనులు మిన్నుముట్టుతున్నాయి. క్రమక్రమంగా పొలిమేరను సమీపించింది అబ్రహా సేన. ఇంతలోనే, ఆకాశాన్నుండి పక్షుల రెపరెపలు వినిపించసాగాయి. క్షణాల్లో ఆకాశమంతా పక్షుల సమూహాలతో నిండిపోయింది. ఆ పిట్టల ముక్కుల్లో, పంజాల్లో గుండ్రటి రాళ్ళు ఉన్నాయి. చూస్తూ చూస్తూ ఉండగానే అవి అబ్రహా సేనపై రాళ్ళ వర్షం కురిపించసాగాయి. (ఆ చిన్న రాళ్ళ రూపంలో దైవ శిక్ష, దైవాగ్రహం ఎమన్ సైన్యంపై అవతరించింది. అవి విషపూరితమైన రాళ్ళయి ఉండాలి) రాతి దెబ్బ తగిలిన ప్రతి సిపాయి శరీరం పగిలిపోతోంది, ప్రేల్చిన తుపాకీలోని తూటాల్లా, ఒక వైపు నుండి రెండవ వైపునకు దూసుకుపోతున్నాయి ఆ రాళ్ళు. సిపాయిాల శరీరాలు క్షణాల్లో క్రుళ్ళిపోసాగాయి. ఇదే విషమ స్థితికి మదపుటేనుగులు కూడా గురయ్యాయి. కొద్ది కాలంలో అంత పెద్ద అబ్రహా సేనలు కుప్పలు కుప్పలుగా కూలిపోయాయి. కాలి, కరిగి, మసి అయి గాలికెగిరిపోయే పొట్టులా భస్మీపటలమైపోయింది ఎమన్ సేన.

వాస్తవంలో దైవానికున్న శక్తి, బలం, అధికారం అనన్య సామాన్యమైనవి. దైవ సంకల్పం నూటికి నూరు పాళ్ళు నిర్విఘ్నంగా, నిరాటంకంగా జరిగితీరుతుంది. ఆ మహత్తర దైవ శక్తిని ఎదుర్కొనే తాహతు, ధైర్యం ఎవరికి ఉన్నాయి?

చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన ఈ సంఘటన పవిత్ర దైవ గ్రంథమైన ఖుర్ఆన్‌లో సంక్షిప్తంగా, మనోజ్ఞంగా వర్ణించబడింది. చివరి దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) జననానికి నలభై, యాభై దినాలకు పూర్వం జరిగింది ఇది. మక్కా నగరవాసులకు దైవం తెలిపిన అపూర్వ విషయమేమంటే, పవిత్ర కాబా మందిరాన్ని నాశనం కాకుండా, బలవంతుడు, దుర్మదాంధుడు అయిన శత్రువు బారి నుండి తాను ఏ విధంగా కాపాడాడో, అదే విధంగా దాని నిర్మాణానికి కారకుడైన హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) ప్రచారం చేసిన

ఇస్లామీయ ధర్మాన్ని కూడా సంరక్షిస్తాడు. తరువాత జరిగిన చరిత్రే దీనికి మహోత్తమ సాక్ష్యం. చివరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) జన్మించి, హజ్రత్ ఇబ్రాహీమ్ (అలై) తెచ్చిన ఇస్లామీయ ధర్మాన్ని పునరుద్ధ రించారు. అంతవరకు కాబా మందిరంలో జరుగుతున్న విగ్రహ పూజను రూపుమాపి దాన్ని పరమ పావనమయిన దైవ మందిరంగా తీర్చిదిద్దారు. శుద్ధమైన దైవారాధనకు ప్రపంచంలోకెల్లా మహోన్నతమైన కేంద్రంగా రూపొందించారు. ఈ పవిత్ర కాబా ఉన్న దిశకే ప్రపంచ ముస్లిమ్ సోదరులంతా తిరిగి నమాజ్ చేస్తారు. వారందరికీ ఇది పరమ పవిత్రమైన పుణ్యస్థలం.

దైవ శక్తి అజేయం, అపూర్వం, అద్వితీయం. దైవం ఏది కోరితే, ఏది సంకల్పిస్తే అది జరిగింది, జరుగుతోంది, జరిగితీరుతుంది.

పవిత్ర ఖుర్ఆన్‌లో ఏనుగులవాళ్ళ గాథ...

అలమ్‌తర కైఫ ఫఅల రబ్బుక బి అస్‌హాబిల్ ఫీల్

అలమ్ యజ్ అల్ కైదహుమ్ ఫీ తజ్‌లీల్

వ అర్‌సల అలైహిమ్ తైరన్ అబాబీల్

తర్‌మీహిమ్ బిహిజారతిమ్ మిన్‌సిజ్జీల్

ఫజఅలహుమ్ కఅస్ ఫిమ్ మ్మాఁకూల్ **(105 : 1-5)**

ఏనుగులవారిని నీ ప్రభువు ఏ విధంగా శిక్షించాడో నీవు చూడలేదా?

వారు పన్నిన కుట్రను ఆయన భగ్నం చేయలేదా? వారి పైకి పిట్టల గుంపుల్ని పంపాడు.

బంక మట్టితో చేయబడిన రాళ్ళతో అవి వారిని తరిమికొట్టాయి.

అప్పుడు వారు పురుగులు తినివేయగా మిగిలిన (ధాన్యపు) పొట్టులా మిగిలిపొయ్యారు.

కందకాలవాళ్ళు

వివిధ కాలాల్లో, వివిధ దేశాల్లో దైవప్రవక్తలు మానవాళికి దైవోపదేశాలను అందజేశారు. ఇహపర లోకాల్లో సుఖశాంతుల్ని ప్రసాదించే వెలుగుబాటను చూపారు. సమాజంలో పేరుకుపోయిన కుళ్ళును పెళ్ళగించారు. అన్యాయాన్ని, అక్రమాన్ని ప్రతిఘటించారు. సాంఘిక దురాచారాలను, మూఢ నమ్మకాలను ఎదుర్కొన్నారు. తాము బోధించిన ప్రతిదీ స్వయంగా ఆచరించి మార్గదర్శకు లయ్యారు. ఈ మహత్తర ఉద్యమంలో ఎన్ని కష్టాలు వచ్చినా సహించి, దైవ బలంపై అచంచల విశ్వాసం కలవారై, తమ జీవిత లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ధైర్యస్థయిర్యాలతో మెరుపుల్లా నిలబడ్డారు. కనుకనే వారి పవిత్ర జీవిత చరిత్రలు అమరగాథల్లా ఉండిపోయాయి. విప్లవానికే ప్రాణం పోసిన విప్లవ వీరులు వారు.

దైవ చింతనను ప్రచారం చేసి ధన్యజీవులైన ఎంతో మంది దైవ ప్రవక్తల్లో హజ్రత్ ఈసా (అలైహిస్సలామ్) (ఏసు) కూడా ఒకరు. ఇస్లామీయ ధర్మాన్ని, దైవ విధేయతను, ఇస్లామీయ జీవిత విధానాన్ని ప్రజలకు బోధించారు. ఈసా (అస) దైవ దాస్యం చేసే విధానాన్ని వారికి నేర్పారు. హజ్రత్ ఈసా (అస) ప్రబోధాలను హృదయపూర్వకంగా విశ్వసించి, తదనుగుణంగా జీవించే వారందరూ ముస్లిమ్‌లు, అంటే దైవ విధేయులు.

హజ్రత్ ఈసా (అస) ప్రపంచాన్నుండి నిష్క్రమించిన ఆరు వందల యాభై సంవత్సరాల తరువాత వచ్చిన దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) అంతిమ దైవప్రవక్త. అంటే ఆయన తరువాత ఇంకా దైవ ప్రవక్తలు రారు అని అర్థం. ఆయన ప్రపంచానికిచ్చిన సందేశం సమగ్రమైన, సంపూర్ణమైన దైవ సందేశం. మానవులకది పరిపూర్ణ జీవిత విధానాన్నిస్తోంది; కనుకనే అందరికీ ఆచరణయోగ్యమైంది, సుస్థిర ప్రపంచ శాంతికి, సవ్యమైన సమాజ పురోగతికి అత్యుత్తమమైన మార్గం అదే.

హజ్రత్ ముహమ్మద్ (స) జననానికి కొన్ని సంవత్సరాలకు పూర్వం ఒక దేశంలో ఒక ముస్లిమ్ సమాజం ఉండేది. ఆ ముస్లిమ్ సంఘ సభ్యులంతా

హజ్రత్ ఈసా (అస)ను నిజమైన దైవ ప్రవక్తగా విశ్వసించి, ఆయన అడుగుజాడల్లో నడిచేవారు. స్వయంగా తాము మంచి పనులు చేస్తూ తమ తోటి సోదరుల్ని కూడా చేయమని ఆహ్వానించేవారు. ఒకే దేవుణ్ణి నమ్మి, ఆయన్నే తమ సృష్టికర్తగా, యజమానిగా, ఆరాధ్యునిగా భావించేవారు. ఆయన్నే పూజిస్తూ, ఆయన ఆజ్ఞల్ని శిరసావహిస్తూ, ఇతరులు కూడా ఆ దైవానికే విధేయులై జీవించాలని ప్రచారం చేసేవారు ఆ ముస్లిములు.

మంచివాళ్ళు ఇతరుల్ని కూడా తమలా మంచివాళ్ళుగా మలచటానికి ఏ విధంగా ప్రయత్నిస్తారో, అదే విధంగా చెడ్డవాళ్ళు కూడా ఇతరుల్ని తమవంటి చెడ్డవాళ్ళుగా చేయటానికి కృషి చేస్తారు. ఎప్పుడయితే దైవ భక్తుడు తాను స్వయంగా దైవ మార్గంపై నడుస్తూ, ఇతరుల్ని కూడా అలా చేయమని ఆహ్వానిస్తాడో, అప్పుడు దైవ ధిక్కారులు అతనికి బద్ధ విరోధులవుతారు. అంటే, మంచికీ చెడుకూ, ధర్మానికీ అధర్మానికీ, న్యాయానికీ అన్యాయానికీ మధ్య నిరంతరం సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఇదే పరిస్థితిని ఆ ముస్లిములు కూడా ఎదుర్కొన్నారు. తమ దేశవాసులనుద్దేశించి వారు, "దైవాన్ని తప్ప ఇతరుల్ని ఆరాధించకండి; ఆయన్ని తప్ప ఇతరుల్ని యజమానులుగా, ప్రభువులుగా అంగీకరించకండి; దైవాజ్ఞల్ని, దైవ చట్టాన్ని కాదని, దైవేతరుల్ని శాసనకర్తలుగా, పరిపాలకులుగా గుర్తించడం మహాపాపం" అని ఉపదేశించారు. భోగ లాలసులయిన ఆ దేశవాసులకు ఈ ఉపదేశాలు కర్ణకఠోరమయ్యాయి. బూజు పట్టిన వారి ఆచారాలకు, సంప్రదాయాలకు, వారి సాంఘిక హోదాకు, కృత్రిమ చట్టాలకు ఈ దివ్య ప్రబోధాలు శక్తిమంతమైన ఛాలెంజీలుగా, ఆటంకాలుగా పరిణమించాయి. కనుక వారు ఆ దైవభక్తుల్ని పీడించటం, వారిపై దౌర్జన్యం చేయటం ప్రారంభించారు. వారితో అన్నారు, "ఇక మీద మీరు ఇలాంటి ఉపదేశాలు చేయటానికి వీలు లేదు. మా సంఘ పెద్దల నుండి మాకు సంక్రమించిన సంప్రదాయాలే నిజమైనవి."

దైవాన్నే నమ్ముకుని, దైవ మార్గంపై స్థిరంగా ఉన్న ఆ దైవ భక్తులు వారి మాటలను ఖాతరు చేయలేదు. ఏ దైవాన్నయితే వారు తమ నిజమైన ప్రభువుగా ఎంచారో, ఆయన ఆజ్ఞల్ని ఎలా ధిక్కరించగలరు? వారందరూ దైవ సమక్షంలో

హాజరయ్యే రోజు తప్పకుండా వస్తుందని వారి ప్రగాఢ నమ్మకం. ఇప్పుడు ఈ దుర్మార్గుల ఆధిక్యాన్ని, వారి బెదిరింపుల్ని చూచి భయపడి, సత్యాన్ని, ధర్మమార్గాన్ని విడనాడితే రేపు తీర్పు దినంనాడు దైవానికి తమ ముఖాన్ని ఎలా చూపించగలరు? దైవ సంతోషాన్ని పొందగలిగితే మరణానంతరం స్వర్గానికి వారసులమవుతామని వారికున్న విశ్వాసం అచంచలమయింది. ఎల్లవేళలా సుఖశాంతులు వెల్లివిరిసే స్వర్గాన్ని, రకరకాల భోగభాగ్యాలు, ఎన్నో దివ్య సంపదలతో తులతూగే చోటును వారు ఎలా వదలుకుంటారు? దైవాగ్రహానికి దారితీసే పనుల్ని ఎలా చేయగలుగుతారు?

ఒక వైపున దైవాన్ని విశ్వసించిన నిజమైన దైవ భక్తులు దైవాదేశాల కనుగుణంగా మానవులంతా జీవించాలని కోరుతూ, తోటి మానవుల్ని కూడా రుజువర్తనులుగా, దైవ విశ్వాసులుగా చేయటానికి కంకణం కట్టుకున్నవారు. రెండవ వైపు, దైవాన్ని విశ్వసించని, దైవాజ్ఞల్ని ధిక్కరించే దైవ విద్రోహులు. వారి మనుసుకు ఏది నచ్చితే అదే మంచి, అదే ధర్మం, వారు చేసేదాన్ని, ఆచరించేదాన్ని ఎవరూ విమర్శించేందుకు వీల్లేదు. వారిని ప్రశ్నించే, నిలదీసి అడిగేవాడు ఎవడూ ఉండకూడదు; స్వార్థపరాయణులు, భౌతిక ఆరాధకులు అయిన వీరికి ముస్లిమ్‌ల దైవ సందేశం చేదుగా అన్పించింది. అది సహజం కూడా.

ముస్లిములు చెప్పే మాటలు స్వచ్ఛంగా, స్పష్టంగా, హృదయానికి హత్తుకునేలా ఉండేవి. సహృదయులు, సత్యప్రియులు వీరి మాటల్లో ఉన్న సత్యాన్ని నమ్మేవారు. ఆ మాటల్లో ఉన్న వెలుగు, ఆకర్షణ దైవ ధిక్కారుల వాదనల్లో లేవు. కనుకనే అవిశ్వాసులకు ముస్లిములంటే అసూయ, ద్వేషం.

ముస్లిముల ఉపదేశాల ప్రభావం, ప్రాబల్యం ఎక్కువ కావటం చూచి సహించలేని దుర్మార్గులు, రాజుతో వారికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. ఆ రాజు కూడా ముస్లిమ్ విరోధి. అధికారం నాదే చెలామణి కావాలనే అహంకారి, దైవాజ్ఞలంటే గౌరవభావంలేని దైవ ధిక్కారి.

ప్రజలు క్రమక్రమంగా దైవ విధేయులయితే దైవాజ్ఞల్ని కాదని, తన ఆజ్ఞల్ని పాలించరని, దేవుణ్ణే తమ ప్రభువుగా, యజమానిగా పరిగణించి, తన

ప్రభుత్వానికి, రాచరికానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తారని తలంచి ఆ క్రూర రాజు ముస్లిములను అందర్నీ నిర్బంధించాడు. దైవ రాజ్యాంగం, దైవ విధేయత అనే నినాదాలను మళ్ళీ ఎత్తకుండా ఉండే విధంగా వారిని శిక్షించాలని నిర్ణయించాడు ఆ దుష్ట భూపతి.

లోతయిన, విశాలమైన పెద్దపెద్ద కందకాలను త్రవ్వించి వాటిని ఎండు కట్టెలతో నింపవలసిందిగా ఆజ్ఞాపించాడు ఆ రాజు. ఆ కట్టెలకు నిప్పు అంటించబడింది. మంటలు బాగా ఉధృతంగా పైకి లేచాయి. ముస్లిములు మండే ఆ కందకాల వద్దకు పిలిపించబడ్డారు. ఆఖరిసారిగా వారికి ఈ విధంగా హెచ్చరిక చేయబడింది: "మీ సిద్ధాంతాన్ని, మీరు చేస్తున్న ఉపదేశాలను పరిత్యజించండి. అలా చేయటానికి మీరు ఒకవేళ ఇష్టపడకపోతే, ఈ కందకాల్లోని మంటలకు ఆహుతి కావలసి ఉంటుంది."

వారికది అక్షరాల అగ్ని పరీక్ష. అటో ఇటో తేల్చుకోవలసిన అతి నాజూకైన సమయం. కాని వారు అదరలేదు, బెదరలేదు. ఆపద్బాంధవుడయిన అల్లాహ్‌నే నమ్ముకున్నారు. ఆ రాజుతో అన్నారు, "మహారాజా! మేము మా ప్రభువును ఎలా ధిక్కరించగలం? ఆయనే ఈ సర్వజగత్తును సృష్టించాడు. ఆ దైవమే దానికి, మాకు యజమాని. ఆయన ఆజ్ఞల్ని ఉల్లంఘించి మేము ఇతరుల బానిసత్వాన్ని ఎలా స్వీకరించగలం? ఈ జీవితం బుద్బుధప్రాయం. కొన్ని దినాల వరకే ఉంటుంది. ఆయన మా పట్ల ప్రసన్నుడయితే మాకు మరే విచారం లేదు. మరణించిన తరువాత మాకు సుఖశాంతుల భోగభాగ్యాల స్వర్గాన్ని ప్రసాదిస్తాడు."

ముస్లిములు నిర్భయంగా బహిరంగ సభలో ఇచ్చిన ఈ జవాబుకు కోపోద్రిక్తుడయ్యాడు గర్విష్టియైన ఆ రాజు. ఐశ్వర్య మదంతో, అధికార బలంతో మత్తెక్కిన ఆ రాజు వారందరిని కాలే కందకాల్లోకి తోయవలసిందిగా ఆజ్ఞాపించాడు. ఒకళ్ళ తరువాత ఒకళ్ళు ఆ దైవ విధేయులంతా మంటల్లో సజీవ దహనం చేయబడ్డారు. ఈ హృదయ విదారక దృశ్యాన్ని తన అనుచరులతో కనుల పండువుగా తిలకించాడు ఆ కిరాతకుడు. సిసలయిన ఆ దైవ భక్తులు చేసిన నేరం ఏమిటంటే, "మాకు దైవంపై విశ్వాసం ఉంది. మేము ఆయన్నే

ప్రభువుగా, ఆరాధ్యునిగా పరిగణిస్తాము. అందరికంటే ఆయనే మహోన్నతుడు, బలవంతుడు. సకల స్తోత్రాలకు హక్కు, అర్హత కలవాడు కూడా ఆయనే. ప్రపంచంలో ఉన్న ప్రతీది ఆయన సొత్తే. అందరికీ యజమాని, ప్రభువు, చక్రవర్తీ దేవుడే. మానవ దృష్టికి అగోచరమయింది కూడా ఆయన దృష్టిని దాటిపోలేదు. ఆయనకు అన్నీ తెలుసు. ఆయన సర్వజ్ఞుడు. ఆయన చేయలేనిది లేదు" అని చిత్తశుద్ధితో నమ్మి ప్రకటించటమే.

దైవాన్ని విశ్వసించనివారు, దైవాన్ని విశ్వసించినవారికి ఎంత ప్రచండ విరోధులౌతారో మీరు ఈ గాధలో చూశారు. ఆ విరోధంలో, ఆ మూర్ఖత్వంలో వారు ఏమేమో చేస్తారు. కాని దానివల్ల అయ్యేదేమిటి? తీవ్ర నష్టానికి గురి అయ్యేదెవరు?

పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ పై వృత్తాంతం "బురూజ్" అనే సూరాలో అభివర్ణించబడింది; "కందకాలు త్రవ్వినవాళ్ళు సర్వ నాశనం చేయబడ్డారు" అని.

ఇదెలా సాధ్యం? చాలా దారుణం అని మీరు అనవచ్చు. కందకాలు త్రవ్వినవాళ్ళు, క్రూరుడైన రాజు, అతని దుష్ట అనుచరులు ఎక్కడ చంపబడ్డారు? చేసిన మహా పాపానికి కఠినంగా శిక్షించబడలేదే? పాపం! అమాయకులైన ముస్లిములే నిర్దాక్షిణ్యంగా, సజీవంగా దహనం చేయబడ్డారే.

అసలు విషయాన్ని తెలుసుకుంటే మీరు అంతగా ఆశ్చర్యపడరు. ముస్లిమ్ దృష్టిలో అసలయిన, సిసలయిన విజయం పరలోక సాఫల్యం. మన జీవితాల్లో ఎన్నో సంఘటనలు జరుగుతూ ఉంటాయి. అవి మనం చేసిన మంచి పనులకు ప్రతిఫలము కావచ్చు లేక చెడు పనులకు శిక్ష కావచ్చు. కాని నిజమైన, శాశ్వతమైన ప్రతిఫలం ఇక్కడ లభించదు. ఎందుకంటే ఇహలోక జీవితం పరీక్షా సమయం వంటిది. అసలు ప్రతిఫలం తీర్పుదినం నాడు పరలోకంలో లభిస్తుంది. ఇప్పుడు మీరు యదార్థాన్ని గ్రహించేవుంటారు, పవిత్ర దైవ భక్తులయిన ముస్లిమ్‌లను మంటల్లో కాల్చి చంపిన రాక్షసులు, మరణానంతరం నరకంలో కాల్చబడతారు. వారు అక్కడ కఠిన శిక్షకు గురికావలసి ఉంటుంది. అది శాశ్వతంగా ఉండే శిక్ష. ఇక్కడ మంటల్లో కాలి దైవం కోసం ప్రాణత్యాగం

చేసినవారికి దేవుడు స్వర్గాన్ని ఇస్తాడు. ఆ స్వర్గంలో ఎల్లప్పుడూ ప్రవహించే సెలయేళ్ళు ఉంటాయి. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు అమర సుఖాలననుభవిస్తూ.

ఇప్పుడు మీరు చెప్పండి. ఎవరి జీవితాలు సఫలమయ్యాయో? వాస్తవమయిన విజయం ఎవరిదో? ఘోర పరాజయాన్ని ఎవరు పొందారో?

దైవాన్ని విశ్వసించినవారు, మంచి పనులు చేసినవారు, దైవాజ్ఞల్ని ఉల్లంఘించనివారు, దేవుణ్ణి తప్ప ఇతరుల్ని తమ ప్రభువులుగా పరిగణించని వారు– వీరే విజయాన్ని, శాశ్వత సుఖాన్ని పొందేవారు. దైవాన్ని విశ్వసించనివారు, దైవాజ్ఞల్ని ధిక్కరించేవారు, దైవ దాస్యానికి బదులు దైవేతరుల దాస్యం చేసేవారు– వీరే అవమానాన్ని, శాశ్వత పరాజయాన్ని పొందేవారు.

ప్రపంచంలో తరచు దైవ భక్తులు, దైవ విధేయులు ఎన్నో కష్టాలకు గురి అవుతూ ఉండటం మనం చూస్తూ ఉంటాం. రకరకాలుగా బాధించ బడతారు. ఒక్కొక్కప్పుడు ప్రాణ త్యాగం కూడా చేయవలసి వస్తుంది. దైవ ధిక్కారులు, దైవ విద్రోహులు భోగభాగ్యాలతో తులతూగుతూ సుఖశాంతుల జీవితాన్ని గడుపుతారు. అల్లాహ్‌ను విశ్వసించనివారు జయాన్ని పొందారు. అల్లాహ్‌ను విశ్వసించినవారు అపజయం పాలయ్యారు అని అనడానికి ఏ మాత్రం ఆస్కారం లేదు. ఎందుకంటే, నిజమయిన జయాపజయాలు పరలోకంలో సంప్రాప్తమవుతాయి. పరలోక జీవితం శాశ్వతంగా ఉండే జీవితం. ఎవరయితే నరకాగ్ని నుండి రక్షింపబడతారో, ఎవరికైతే స్వర్గలోక ప్రవేశార్హత లభిస్తుందో, వారిదే నిజమయిన విజయం. ఇహలోకంలో వచ్చే కష్టాలు, నష్టాలు తాత్కాలికమైనవి. వాటికి జడిసి పరలోక సుఖాన్ని వదలుకోవడం అవివేకం.

దేవుని పట్టు, ఆయన దెబ్బ ప్రచండమయినవి. ఆయన ఏదయినా చేయగల మహా శక్తిమంతుడు. మానవుడు దైవ సంతోషాన్ని పొందగలగడమే మహత్తర విజయం.

ఓ ప్రభూ! నీవు సంతోషించే పనుల్నే మేము చేసేలా అనుగ్రహించు. నరకజ్వాలల నుండి మమ్మల్ని కాపాడు– నీవు క్షమానిధివి, ప్రేమ స్వభావుడవు.

పవిత్ర ఖుర్ఆన్‌లో కందకాలవాళ్ళ కథ...

ఖుతిల అస్‌హాబుల్ ఉఖ్‌దూద్
అన్నారి జాతిల్ వఖూద్
ఇజ్‌హుమ్ అలైహా ఖుఊద్
వ హుమ్ అలా మా యఫ్ అలూన బిల్ మూమినీన షుహూద్
వమానఖమూ మిన్‌హుమ్ ఇల్లా అన్ యూమి
నూ బిల్లా హిల్ అజీజిల్ హమీద్
అల్లజీ లహూ ముల్‌కు స్సమావాతి వల్
అర్‌జి వల్లాహు అలాకుల్లి షైఇన్ షహీద్
ఇన్నల్లజీన ఫతనుల్ మూమినీన వల్ మూమినాతి సుమ్మలమ్
యతూబూ ఫలహుమ్ అజాబు జహన్నమ వలహుమ్ అజాబుల్ హరీఖ్

(85 : 4-10)

వంట చెరుకుతో మండే అగ్నిగుండాలను తయారుచేసిన వారు హతమార్చబడుదురు గాక! వాస్తవానికి వీరు వాటి (నరకాగ్ని గుండాల) దగ్గరగానే కూర్చున్నారు. దైవ విశ్వాసులపై జరిగే అత్యాచారాలకు వీరు ప్రత్యక్ష సాక్షులు.

వీరికి నచ్చని విషయం కేవలం వారు (విశ్వాసులు) సర్వాధికారి, సకల స్తోత్రాలకు అర్హుడు, గగన భువనాల రాజ్యాధిపతి అయిన అల్లాహ్‌ను విశ్వసించడమే. అల్లాహ్ జరిగే అన్ని విషయాలకు సాక్షి.

ఎవరు దైవాన్ని విశ్వసించిన స్త్రీ పురుషులను పీడిస్తారో, చేసిన ఈ పాపానికి పశ్చాత్తాపపడరో, వారికి నరకయాతన ప్రాప్తం, కణకణ మండే అగ్ని బాధే వారి భాగ్యం.

శనివారం వాళ్ళు

చేపలక్కూడా మంకుతనం, మొండిపట్టు ఉందేమో అనిపిస్తుంది. శనివారం రాగానే అవి మందలకు మందలుగా నీళ్ళపైకి వచ్చి సయ్యాటలాడుతూ ధళధళా మెరుస్తూ ఈదుతూ ఉండేవి. వల సహాయం లేకుండానే వాటిని పట్టుకోవటానికి వీలుగా ఉండేది. సాధారణంగా వారమంతా అవి నీళ్ళ లోపల్నే ఉండేవి. ఎవరన్నా చూస్తే అసలు సముద్రంలో చేపలే ఉండవేమో అనుకుంటారు. ఇది చాలా విచిత్రమైన విషయం కదూ!

ఏదయితే కారణం లేకుండా, అకస్మాత్తుగా సంభవిస్తుందో, దాన్నే విచిత్రం లేక వింత విషయం అంటాం. కాని ఈ చేపల విషయం దైవాజ్ఞానుసారంగా జరుగుతూ ఉండేది. అసలు వృత్తాంతం ఇది: చదవండి.

పూర్వకాలంలో ఒక సముద్ర తీరాన చేపలు పట్టేవాళ్ళు నివసిస్తూ ఉండేవారు. ఆ జాతి ప్రజలు దైవాజ్ఞానుసారం వారంలోని ఒక దినాన్ని ప్రత్యేకంగా దైవారాధన కొరకే వినియోగమయ్యేలా ఏర్పాటు చేసుకున్నారు. అది శనివారం రోజు. అంటే శనివారం నాడు ఆ ప్రజలంతా దైవారాధనలో, దైవ చింతనలో నిమగ్నులై ఉండాలని దైవాజ్ఞ అయింది. ఆ రోజంతా ప్రపంచానికి సంబంధించిన ఏ పనినీ వారు చేయకూడదు. చేపలను పట్టటం వారి వృత్తిగా ఉండేది. కాని శనివారంనాడు చేపలను పట్టకూడదని అల్లాహ్ నిషేధం విధించాడు.

దైవ విధేయులుగా ఉన్నంత వరకూ ఆ ప్రజలు ప్రతి శనివారం దైవారాధనలో లీనమై ఉండేవారు. ప్రాపంచిక విషయాలను పట్టించుకునేవారు కారు. చేపల వేట కూడా మానారు. కాని, వారి జీవితాల్లో క్రమేణా మార్పు రాసాగింది. దైవ ధర్మపరాయణులైనవారు, దైవాజ్ఞలంటే అజాగ్రత్త చూపటం మొదలెట్టారు. అధర్మం వైపునకు, దుర్మార్గం వైపునకు వారి జీవితాలు మ్రొగ్గసాగాయి. దైవం నిర్ణయించిన మంచీ చెడుల హద్దులను అతిక్రమించ సాగారు. కాంక్షలకు దాసులు అయ్యారు. వారిలో స్వార్థం, కపటం, మోసం, వంచనలు తలెత్తాయి. తత్ఫలితంగా శనివారం రోజుకు ఉండవలసిన గౌరవ

మర్యాదలు, పవిత్రత లేకుండాపోయాయి. ఆ రోజు దైవ ప్రార్థన, దైవారాధన చేయటమే వారికి శ్రమగా, బరువుగా తోచసాగింది. సంఘంలోని పెద్దల భయం వల్లనో లేక వంశపారంపర్యంగా వచ్చే ఆచారం అంటే గౌరవం వల్లనో వారు కొద్దో గొప్పో దైవారాధన చేస్తే చేసేవారు, లేకపోతే లేదు.

అల్లాహ్‌కు ఎవరి ఆరాధనలూ అవసరం లేదు. అందరూ తనను ఆరాధించాలని ఆయన పరితపించటం లేదు. మనమంతా దైవానికి విధేయులమై ఉండటం వల్ల, ఆయన ఆజ్ఞల్ని పాటించటం వల్ల ఆయనకు కలిగే ప్రయోజనం ఏమీ లేదు. అందరూ దైవాన్ని ఆరాధించటం వల్ల ఆయన అంతస్తు ఏమైనా పెరుగుతుందనో లేక ఆయనకున్న గౌరవం అధికమవుతుందనో భావించటం పొరపాటు. దేవుడు వీటన్నిటికీ అతీతుడు. మన దైవారాధనలు, మన నమాజ్‌లు, మన దైవాజ్ఞానువర్తన మన జీవితాలను తీర్చిదిద్దుతాయి, అర్థవంతం చేస్తాయి. అవి ఉజ్వల భవిష్యత్తుకు అపురూపమయిన సోపానాలు. సత్యం, ధర్మం, ప్రేమ, సభ్యత, సంస్కారం, క్రమశిక్షణ, సంతృప్తి మొదలైన మంచి గుణాలతో మన జీవితాలు ప్రకాశిస్తాయి. మనం మంచి వ్యక్తులుగా, బాధ్యతాయుతమయిన పౌరులుగా జీవించగలుగుతాము. అన్నిటికంటే ప్రధాన విషయం, మనం శ్రేష్ఠమైనదిగా గుర్తించి ఎన్నుకున్న జీవిత విధానంపై స్థిరచిత్తులమై ఉండటం సులభసాధ్యమవుతుంది. దైవేచ్ఛ కూడా మనతో సహకరిస్తుంది.

మంచి పనులు చేయాలనే ఉద్దేశ్యం, కోరిక, ఉత్సాహం మనకుంటే మార్గాలు ఎన్నో లభిస్తాయి. వాటంతటవే సుగమం కూడా అవుతాయి. ఎల్లప్పుడూ మనం మంచినే కాంక్షిస్తాం; మంచినే చేస్తూ ఉంటాం. చివరకు మన జీవితం మంచి పనులకు అంకితమవుతుంది. ఇదే పరిస్థితి చెడు విషయంలో కూడా ఉంటుంది. చెడు చేయటం ప్రారంభించిన తరువాత మన మనస్సు ఎప్పుడూ చెడునే అభిలషిస్తుంది. ఒక మనిషి ఒక చెడు పని చేసిన తరువాత, సునాయాసంగా రెండవ చెడు పనిలో తనకు తెలియకుండానే ఇరుక్కుపోతాడు. ఎవరయితే ఒక చెడు పని చేస్తూ, ఇది మొదటిసారేగా, ఫరవాలేదు, ఇకముందు చేయకూడదు, దీని తరువాత మంచి మనుషులమవుదాము అని తమను తాము సంతృప్తిపరచుకుంటారో, వారు చెడు పనిని రెండవసారి ఏ ప్రబల కారణము

లేకుండానే చేస్తారు. మంచి పని చేయటానికి అలాంటివారు తరచు ఆలోచిస్తూ, అనుమానిస్తూ ఆలస్యం చేస్తారు. వారి జీవితాల్లో ప్రవేశించిన చెడు లక్షణం లేక దురభ్యాసం నిరాటంకంగా, నిర్విఘ్నంగా పెరుగుతూ పెద్దదై శాశ్వత స్థానాన్ని ఏర్పరచుకుంటుంది. నలువైపుల నుండి అది వారిని తీవ్రంగా బంధిస్తుంది. ఆలోచించే శక్తిని, వివేకాన్ని, విచక్షణా జ్ఞానాన్ని కబళిస్తుంది. వారు ధర్మమార్గం వైపునకు తిరిగి రావటమనేది రోజుకురోజు దుర్లభమవుతుంది.

ఇదే విషమ స్థితికి శనివారం వాళ్ళు కూడా లోనయ్యారు. ఎప్పుడయితే వారి జీవితాల్లో దైవాజ్ఞలంటే ప్రతికూల వైఖరి ఉత్పన్నమయిందో, అప్పటి నుండే వారు సన్మార్గంపై స్థిరంగా ఉండటం కష్టతరమయింది. అడుగడుగునా ప్రతి విషయంలో వారు దైవధిక్కారం, దైవాజ్ఞోల్లంఘనం చేయసాగారు. ఏ రోజయితే చేపల్ని పట్టటం పాపమో (అంటే శనివారం రోజు), అదే రోజున చేపలు, దైవాజ్ఞ వల్ల ఎక్కువ సంఖ్యలో నీళ్ళ పైకి వచ్చి ఆటలాడుతూ ఉండేవి. దైవ తిరస్కారం చేస్తూ చేస్తూ క్రమేపి ఆ ప్రజల హృదయాలు కఠినమయ్యాయి. వారు ఈ పాపం చేయటానిక్కూడా ఉపక్రమించారు. శనివారం నాడు చేపల వేట నిషేధించబడినప్పటికీ, వారు చేపల్ని పట్టడం ప్రారంభించారు. ఈ విధంగా వారి పాపాల జాబితా అంతులేకుండా పెరిగిపోయింది. దైవ శిక్షకు, దైవాగ్రహానికి పరిపూర్ణార్హతను పొందారు.

2

ఆ ప్రదేశం అంతా దైవ ద్రోహులతో, దైవ తిరుగుబాటుదార్లతో నిండిపోయింది. వారి సంఖ్య ఎంత అధికంగా ఉందంటే, అసలు ఆ ప్రాంతంలో మంచి మనుష్యులు, దైవ విశ్వాసులు ఉన్నారా లేరా అనే అనుమానం కలుగుతుంది. ఎటు చూచినా దుర్మార్గం, దౌర్జన్యం రాజ్యం చేస్తున్నాయి. ఎవరి జీవితాలు కూడా దైవ అవిధేయతకు, హింసా ప్రవృత్తికి, కపటకావేషాలకు అతీతంగా లేవు. కాని ఆ బస్తీలో ఇంకా దైవ భక్తులు, పరిశుద్ధ హృదయులు ఉన్నారు. ఏ మురికికూపంలోకి ఆ బస్తీవాళ్ళ జీవితాలు కూరుకుపోయాయో, ఆ మురికి నుండి దూరంగా వారి (దైవ విశ్వాసుల) జీవితాలు ఇప్పుడు కూడా పవిత్రంగా ఉన్నాయి.

మంచివారిలో రెండు వర్గాలున్నాయి. మొదటి వర్గం, ఆ బస్తీవాళ్లు ఇక బాగుపడటం కల్ల, వారిని దైవ విధేయులుగా చేయటం అసాధ్యమైన కార్యం అని నిరాశ చెందినవారు. ఏ మంచి మాటనూ, ఏ ఉపదేశాన్నీ వారు వినటానికి తయారుగా లేరు. కనుక వారిని సన్మార్గులుగా, దైవ భక్తులుగా సంస్కరించటం అసంభవం అని వారి అభిప్రాయం. ఆ కారణం వల్ల వారు, ఆ బస్తీ వారి విషయాల్లో జోక్యం కలుగజేసుకోవడమే మానేశారు. తమంతట తాము దైవ విధేయులుగా మెలిగేవారు. మంచీ చెడుల విచక్షణ కనబరిచేవారు. కనుకనే శనివారానికున్న పవిత్రతను, ప్రాముఖ్యాన్ని గుర్తించి, ఆ రోజున దైవారాధనలో, దైవ నామస్మరణలో నిమగ్నమయ్యేవారు.

ఇక రెండవ వర్గంవారు, తాము స్వయంగా ధర్మమార్గంపై స్థిరంగా ఉంటూ దైవ విధేయులై జీవిస్తూ, తమ తోటి సోదరులు అజ్ఞానులుగా, దుర్నీతిపరులుగా, అవిధేయులుగా జీవించటాన్ని సహించేవారు కారు. జరిగే అత్యాచారాలను, దుర్మార్గాలను చూచి ఖేదపడేవారు. వారికి కలుగబోయే దుష్ఫలితాలను గురించి ఆలోచించి చింతించేవారు. తమంతట తామే దైవ ధర్మమార్గంపై నిలకడగా ఉండటం వారికి సంతృప్తిని, శాంతిని ఇచ్చేది కాదు. తాము చేసే దైవారాధనలు పరలోకంలో ముక్తిని, మోక్షాన్ని పొందటానికి చాలు అని సంతోషపడేవారు కాదు. బస్తీలో ఉంటున్న అత్యధిక ప్రజానీకం, నైతికంగా పతనమైపోవటం వారిని ఎల్లప్పుడూ కలవరపరచేది. కనుక వారు ప్రజలకు ధర్మమార్గాన్ని బోధిస్తూ, ఏ ఏ దుర్మార్గాలు, రుగ్మతలు వారి జీవితాల్లో ప్రవే శించాయో వ్రేలెత్తి చూపేవారు. వారిని చెడు పనులు చేయకుండా చేయిపట్టి ఆపేవారు. రాబోయే దైవ శిక్షను గురించి హెచ్చరించేవారు; భయపెట్టేవారు.

ఆ బస్తీవారు దురభ్యాసాలకు, చెడు వ్యసనాలకు ఎంతగా దాసు లయ్యారంటే వారి మనోకాంక్షలకు వ్యతిరేకంగా ఉన్న ఏ మాటల్నీ, ఏ విమర్శల్నీ వినేవారు కాదు. పైపెచ్చు మంచి మాట బోధించేవారికి శత్రువులయ్యేవారు. ప్రజల ఈ వైఖరిని చూచే మొదటి వర్గంవారు వారికి దూరంగా ఉంటూ తమ వరకు తామే మంచి మార్గంపై ఉండటం చాలు అని తృప్తిపడేవారు. రెండవ వర్గంవారిని, అంటే సంఘాన్ని సంస్కరించటానికి కంకణం కట్టుకున్నవారి

నుద్దేశించి మొదటి వర్గంవారు అనేవారు: "మంచి మాటల్ని వినటానికే తయారుకానివారికి ధర్మబోధ చేసి ఏం ప్రయోజనం? వారు చేసే అన్యాయాలు, అక్రమాలు, అత్యాచారాలు ఎంత పెచ్చుపెరిగిపోయాయంటే, కొద్ది కాలంలోనే దేవుడు వారిని తప్పకుండా సర్వనాశనం చేయటమో లేక కఠిన శిక్షకు గురిచేయటమో జరుగుతుంది.

వ్యాధిగ్రస్తుడైన మనిషి వైద్యుడిచ్చిన మందును త్రాగాలి. కాని ఆ విధంగా చేయకుండా, వైద్యుడు అసమర్ధుడు, వైద్య శాస్త్రంలో అతనికి ప్రావీణ్యం లేదు అని వైద్యుణ్ణి దూషిస్తే మాత్రం ఆ వ్యాధి నయమవుతుందా? రోగం తీవ్రతరమై మరణం తప్పదు. అలాంటి రోగిచే మందు త్రాగించటానికి చేసే ప్రయత్నం వ్యర్థప్రయత్నం కాకపోతే మరేమవుతుంది?

కాని రెండవ వర్గంవారు ఎంత విచిత్రమైన జవాబిచ్చారో చూడండి: "మరణించిన తరువాత, దేవుని సమక్షంలో హాజరై ప్రతి విషయాన్ని గురించి జవాబు చెప్పుకోవాలి అనే భయం మాకు ఉంది. అంతిమ దినంనాడు దేవుడు, 'దుర్మార్గం ప్రబలుతూ ఉంటే మీరు చూస్తూ ఎందుకు మౌనం వహించారు' అని అడిగితే, 'ప్రభూ! మా కర్తవ్యాన్ని మేము నిర్వహించాము' అని కనీసం జవాబు చెప్పుకోగలుగుతాము. పైగా, మేము చేసే ధర్మబోధ వల్ల బహుశా ప్రయోజనం కలగవచ్చు. ఇందులో ఆశ్చర్యం లేదు, వారి హృదయాల్లో దైవ భయం కలిగి, వారి జీవితగతే మారిపోవచ్చు."

వారి ఈ దృక్పథంలో ఎంతో వాస్తవికత, వివేకం, సహేతుకత్వం ఉన్నాయి. దుర్మార్గాన్ని, అధర్మాన్ని తప్పనిసరిగా నిర్మూలించవలసిందే. అది ఎవ్వరి బాధ్యత కాదు కాని శక్తివంచన లేకుండా ప్రయత్నం చేయటం ప్రతివాడి ధర్మం. దుర్మార్గుల్ని సన్మార్గులుగా, అవినీతిపరుల్ని నీతిమంతులుగా, దైవ అవిధేయుల్ని దైవ విధేయులుగా మార్చివేయాలనే బాధ్యత కడకు దైవ ప్రవక్తలపై కూడా లేదు. ఆ మార్పుకు, ఆ పరివర్తనకు దైవసంకల్పం, దైవానుకూల్యత అనివార్యం. అధర్మాన్ని, అవిశ్వాసాన్ని రూపుమాపటానికి శక్తివంచన లేకుండా మనం ప్రయత్నం చేశామా? లేదా? అనే ప్రశ్నకు దైవం ముందు ప్రతి మనిషి జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. చివరి దైవ ప్రవక్త ముహమ్మద్ (స)

ఏమన్నారంటే: "దుర్మార్గం, దౌర్జన్యం జరుగుతూ ఉండటాన్ని ఎవరన్నా చూచినట్లయితే, దాన్ని వారు తమ చేత్తో (అంటే తమ శక్తిని ఉపయోగించి) ఆపాలి; ఈ పని చేయటానికి శక్తి లేకపోతే దాన్ని తమ నోటితో (అంటే జ్ఞాన బోధ, ధర్మోపదేశం చేసి) ఆపాలి; ఇది కూడా చేయలేకపోతే, వారు కనీసం తమ మనస్సులో దాన్ని చెడుగా, పాపంగా భావించాలి; అది విశ్వాసం అత్యంత బలహీన దశ." మనుషుల హృదయాంతరాళాల్లో ఉన్న విషయాలను, భవిష్యత్తులో జరిగే సంఘటనలను ఎరిగినవాడు దేవుడు మాత్రమే. ఈనాడు దైవ ధర్మానికి శత్రువులుగా ఉన్నవారు ముమ్ముందు దాన్ని గ్రహించి, శిరసావహించి దైవ విధేయులుకారని ఎవరు ఖండితంగా చెప్పగలరు? దైవ మార్గంపై నడిచే భాగ్యాన్ని ఎవరికైతే దైవం కలుగజేశాడో, ఎవరి బుద్ధి సత్యాన్నీ, ధర్మాన్నీ గుర్తించిందో, వారు తమ దైవం చూపిన ఈ అనుగ్రహానికి ఆచరణలో కృతజ్ఞతలు తెలుపుకోవాలి. అది ఎలా అంటే, దైవ మార్గాన్ని తప్పినవారిని దైవ మార్గంపై నడిపించే ప్రయత్నం చేయాలి. లోపభూయిష్టమయిన జీవిత విధానాలను అనుసరించిన కారణంగా ఏ కష్టాలకు, ఏ దుఃఖాలకు, ఏ దీనావస్థకు మానవులు అనివార్యంగా గురి అవుతున్నారో, వాటి నుండి వారిని రక్షించాలి, చిత్తశుద్ధితో తాము దైవ విధేయత చూపటం, ఇతరులచే కూడా ఆ విధంగా చేయించటం - ఇదే అన్నిటికంటే ఉన్నతమైన, ఉత్కృష్టమయిన జీవిత లక్ష్యం.

3

ఇక ఆ బస్తీవాళ్ళను గురించి వినండి. దైవ ధర్మోపదేశం చేసేవారిని వారు తూలనాడారు. నిద్రాణమై ఉన్న మానవతను మేల్కొల్పటానికి అజ్ఞాన తిమిరాల్లో తారాడుతున్న ప్రజలకు వెలుగుబాటను చూపటానికి చేయబడిన ప్రయత్నాలను వారు పరిహసించారు. జీవిత పంథాను మార్చుకోవటానికి వారు తిరస్కరించారు. అప్పుడు వారిపై దైవ శిక్ష అవతరించింది. దుర్మార్గులతోపాటు వారిని సత్యమార్గం వైపునకు పిలిచినవారికి నిర్లక్ష్యభావం చూపినా, తూలనాడినా,

ధర్మోపదేశం చేయటమే తమ ధ్యేయంగా పెట్టుకున్నవారికి దైవ శరణు, దైవ రక్షణ లభించాయి.

తాము మాత్రం సన్మార్గంపై నడుస్తూ, ఇతరులను సన్మార్గులుగా చేయటం అసంభవం అని తలచినవారిని కూడా దైవ శిక్ష కబళించింది.

దుర్మార్గులు, దైవ అవిధేయులు ధర్మపథం వైపునకు రావటానికి ఏ మాత్రం అవకాశం ఉన్నా వారికి అంతవరకు విడుపునివ్వటం శాశ్వత దైవ సంప్రదాయం. అంతిమ దైవ శిక్ష అవతరించే ముందు హెచ్చరికలు చేసే కొద్దిపాటి శిక్షలు అవతరిస్తాయి. కనీసం అప్పుడయినా దైవ ధిక్కారులు కళ్ళు తెరిస్తే, వారు రాబోయే ఉపద్రవాన్నుండి రక్షింపబడటానికి సంపూర్ణ అవకాశం ఇవ్వబడుతుంది. హెచ్చరిక చేసే ఈ చిన్న చిన్న ఉపద్రవాలు మళ్ళీ మళ్ళీ వస్తాయి. కాని వాటిని "పరిస్థితులు తారుమారు కావటం ప్రకృతి సిద్ధమే" అని, అలాంటి ప్రమాణాలు సంభవించటం సర్వసామాన్యమే అని భావిస్తూ నిర్లక్ష్యం చేసి తమ పూర్వ స్థితికే అంటుకుని ఉంటే, దైవ శాసనం ఇచ్చే అవకాశం, గడువు అంతమవుతాయి. చెడు పనులు చేసినందువల్ల ఉత్పన్నమయ్యే దుష్ఫలితాలు, దుష్పరిణామాలు వచ్చిపడతాయి. వాటిని అనుభవించటం తప్పనిసరి అవుతుంది.

ఈ దుస్సహ, దుర్భర స్థితికే శనివారం వాళ్ళు కూడా గురి అయ్యారు. ధర్మోపదేశాల వల్లగాని, హెచ్చరికలు చేసే చిన్న చిన్న ఉపద్రవాల వల్లగాని, వారికి ఎలాంటి గుణపాఠం కలుగలేదు. వారు తమ వైఖరిని మార్చుకోలేదు. అప్పుడు వారిని సర్వనాశనం చేయాలని దైవ నిర్ణయమయింది. వారి ముఖాలు వికృతంగా, భయంకరంగా కోతుల ముఖాల్లా మారిపోయాయి. మూడు రోజుల్లోనే వారందరు ఘోర దుర్మరణం పాలయ్యారు.

మనిషి కోతిగా ఎలా మారిపోతాడు అని మీరు ఆశ్చర్యపడవచ్చు. ఇది నిజంగా అనూహ్యమే, కాని అసంభవం మాత్రం కాదు. దైవానికున్న శక్తి చాలా ప్రచండమయినది. ఆయనకు అసాధ్యమన్నదేదీ లేదు. దైవం తలచటమే ఆలస్యం, క్షణాల్లో అది అయి తీరుతుంది.

ఈ సందర్భంలో మీరు వైద్య శాస్త్రానికి సంబంధించిన ఒక విషయాన్ని తెలుసుకుంటే మీ సందేహాలు తీరిపోతాయి. ఇది చాలా కాలం క్రిందట జరిగింది. జకరియ్యారాజీ అనే ఒక పెద్ద డాక్టర్ ఉండేవారు. కుష్టు వ్యాధి పుట్టుపూర్వోత్తరాలను గురించి ఆయన సశాస్త్రీయమయిన పరిశోధనలు జరిపారు. అతి భయంకరమైన ఆ వ్యాధిని గురించి ఆయన ఇలా తెలిపారు. "కుష్టు వ్యాధిలో ఎన్నో రకాలు ఉన్నాయి. వాటిలో అత్యంత ప్రమాదకరము, ప్రాణాంతకము అయిన ఒక రకం ఉంది. ఆ వ్యాధి సోకటం వల్ల మనిషి శరీరంలో విషపూరితమైన రక్తం వ్యాపించి పరిశుద్ధ రక్తాన్ని మలినం చేస్తుంది. అప్పుడు శరీర కండరాలు క్రమేపీ ముడుచుకుపోయి రోగి విషపూరితమయిన, వర్ణనాతీతమైన బాధకు, చిత్రవధకు గురి అవుతాడు, కొంత కాలంలోనే రోగి ముఖం, శరీరం వికృతంగా, భయంకరంగా మార్పు చెందుతుంది. అతని ఆకారం కోతి ఆకారాన్ని పోలి ఉంటుంది. ఆ వ్యాధి ఈ దుర్భర చరమ దశకు చేరుకుంటే, ఇక దానికి మందే లేదు. కొద్ది రోజుల్లోనే రోగి కృంగి కృశించి మరణిస్తాడు." నిజంగానే దైవ శిక్ష వివిధ రకాలుగా, వివిధ రూపాల్లో అవతరిస్తుంది. పూర్వకాలంలో లేని వ్యాధులు ఇప్పుడు ఎన్నో ఉన్నాయి; మనకు తెలియని ఎన్నో రకాల వ్యాధులు ఆ కాలంలో ఎన్ని ఉండేవో! దైవ శిక్ష అవతరించే రూపాలు, రీతులు ఎన్నో విధాలు. కాని శిక్షించే, సర్వనాశనం చేసే దైవ విధానం ఒకటే. దైవాజ్ఞల్ని ఉల్లంఘించినప్పుడు, దైవానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినప్పుడు దైవ శిక్ష అవతరించడం ఖాయం. కాని అది ఒకప్పుడు త్వరగా, మరొకప్పుడు ఆలస్యంగా వస్తుంది. దైవ శిక్షలు అవతరించే రూపాలు ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండనవసరం లేదు. అవి మారుతూ ఉంటాయి, దుష్టుల్ని శిక్షించడం మాత్రం దైవ సాంప్రదాయం, దైవ విధానం.

4

శనివారం వాళ్ళ గాథను మీరు చదివారు. దీన్ని పవిత్ర ఖుర్‌ఆన్‌లో సంగ్రహంగా చెప్పి దేవుడు మనకు మహోపదేశం చేశాడు. రండి, ఆలోచిద్దాం. ఈ గాథలో మనకు దొరికే మహత్తర సందేశమేమిటో.

(1) తప్పుడు జీవిత విధానాలను అనుసరించడం వల్ల, మనం తప్పుడు పనులను విధిగా చేయవలసి వస్తుంది; అంటే ఆ విధానాల ప్రభావం, మన మనస్సుపై మేధస్సుపై ఎక్కువగా ఉంటుంది. అవి మన సర్వస్వాన్ని స్వాధీనం చేసుకుంటాయి. చెడు పనులు, చెడు పరిణామం వైపునకు లాక్కుపోతాయి.

(2) దైవ కృప వల్ల, మీకు రుజుమార్గం, మోక్ష మార్గం తెలిస్తే, దాన్ని మీరు మీ వరకే పరిమితం చేయడం లేక దానిపై స్వయంగా మీరు మాత్రం నడవగలగటం మీకు ఎంతో ప్రయోజనకరం కాగలదు. అంటే, అంతటితో మీరు అవలంబించే సన్మార్గం సంపూర్ణం కాలేదన్న మాట. త్రోవ తప్పిన వారికి నిజమయిన త్రోవను చూపే గురుతరమైన బాధ్యత మీపై ఉంది. ఎవరైతే ఆ విధంగా చేయరో వారు అంతిమ దినంనాడు తమ ప్రభువు ముందు ఈ అలక్ష్యాన్ని గురించి సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుంది.

(3) ప్రజలను దైవ మార్గం వైపునకు రమ్మని బలవంతం చేయడం ఏ మాత్రం తగదు. కాని, మీ మాటలను వారు క్షుణ్ణంగా అర్థం చేసుకునేలా విశదపరచడం, వారే స్వయంగా ముందుకు వచ్చి దాన్ని విశ్వసించేలా శక్తివంచన లేకుండా ప్రయత్నం చెయ్యడం మీ కర్తవ్యం. వారు మీ మాటలను విశ్వసించకపోతే మీరు బాధపడుతూ నిరాశా నిస్పృహలకు లోనుకాకూడదు. ఈ కార్యం చేపట్టేటప్పుడు మీ ధ్యేయం, మీ లక్ష్యం కేవలం దైవ ప్రసన్నత పొందటం మాత్రమే అయి ఉండాలి. మీ విద్యుక్త ధర్మాన్ని నిర్వహించటానికే మీరు ఈ పనిని చేయాలి. ప్రజలను ఉపదేశం ద్వారా, ప్రేమతో దైవ మార్గం వైపునకు పిలిచే ప్రారంభ దశ కానివ్వండి లేక అధర్మాన్ని, అన్యాయాన్ని, దౌర్జన్యాన్ని రూపుమాపటానికి తప్పనిసరిగా బలాన్ని, శక్తిని ఉపయోగించే అంతిమ దశ కానివ్వండి. ఇదే ధ్యేయం, ఇదే లక్ష్యం ఎల్లప్పుడూ మీ జీవిత పరమావధి కావాలి. అదే లేకపోతే మీ సంస్కరణోద్యమం ఫలప్రదం కాజాలదు.

(4) ఇహలోకంలో దైవ శిక్ష నుండి సంరక్షింపబడటానికి, పరలోకంలో దైవానికి ప్రీతిపాత్రులు కావటానికి మార్గం ఒక్కటే. అదే దైవ విధేయతా మార్గాన్ని

స్వయంగా అవలంబించటం, ఇతరుల్ని కూడా ఆ మార్గం వైపునకు రమ్మని ఆహ్వానించటం, ఈ పనిని జీవితాంతం నిరంతరాయంగా చేయాలి.

పవిత్ర దైవగ్రంథంలో శనివారంవాళ్ళ గాథ...

వస్అల్‌హుమ్ అనిల్ ఖర్య తిల్లతీ కానత్
హాజిరతల్ బహ్ర్, ఇజ్‌య అదూన
ఫిస్సబ్తి ఇజ్‌తా తీహిమ్ హీతానుహుమ్ యౌమ
సబ్ తిహిమ్ షుర్రఅన్ వ్వయౌమ లా యస్‌బితూన
లా తా తీహిమ్ కజాలిక నబ్లూహుమ్ బిమాకాను యఫ్సుఖూన్.
వ ఇజ్ ఖాలత్ ఉమ్మతుమ్ మిన్‌హుమ్
లిమ తఇజూన ఖౌమనిల్లాహు ముహ్లికు హుమ్
ఔ ముఅజ్జిబుహుమ్ అజాబన్ షదీదా.
ఖాలూ మఅజిరతన్ ఇలా రబ్బికుమ్ వల అల్లహుమ్ యత్తఖూన్
ఫలమ్మా నసూ మా జుక్కిరూ బిహీ అన్‌జైనల్ లజీన
యన్‌హౌన అనిస్సూఇ వ అఖజ్
నల్ లజీన జలమూ బి అజాబిమ్ బ ఈ సిమ్
బిమాకానూ యఫ్సుఖూన్.
ఫలమ్మా అతౌ అమ్మానుహూ అన్‌హు
ఖుల్నా, లహుమ్ కూనూ ఖిరదతన్ ఖాసిఈన్ **(7 : 163-166)**

ఓ ప్రవక్తా! సముద్ర తీరానికి దగ్గరలో ఉన్న ఆ పట్టణాన్ని గురించి (యూదులను) అడుగుము. శనివారం గురించి (చేపలను పట్టవద్దని దైవం చేసిన శాసనం) పరిధుల్ని వారు అతిక్రమించారు. వారు నిషేధాజ్ఞలు పాటించవలసిన దినం (శనివారం) ఆసన్నమయినప్పుడు

చేపలు నీటిపై తేలియాడుతూ వారికి తారసపడేవి. కాని, శనివారంకాని దినాల్లో వచ్చేవికావు (ఇది దైవాజ్ఞ). వారు దైవాజ్ఞల్ని ఉల్లంఘించటం మూలాన ఈ విధంగా మేము వారిని పరీక్షకు గురిచేశాము.

ఆ పట్టణంలోని ఒక వర్గంవారు (ధర్మోపదేశం చేసే విశ్వాసులతో) అన్నారు, "ఎవరినైతే దేవుడు సర్వనాశనం చేయనున్నాడో లేక కఠిన శిక్షకు గురి చేయనున్నాడో, వారికి మీరు ధర్మోపదేశం ఎందుకు చేస్తున్నారు? (వారు మీ మాటలు వినరు కనుక మీరు చేసే ప్రయత్నాలు వ్యర్థమయినవి)." దానికి ధర్మబోధ చేసేవారు జవాబిచ్చారు, "మా కర్తవ్యాన్నయితే మేము నిర్వహించాం అని మన ప్రభువుతో చెప్పుకోగలిగేందుకు మేము ఈ విధంగా చేస్తున్నాము; అదీకాక బహుశా వారు భయభక్తులు కలవారుగా మారవచ్చు."

వారికి చేయబడిన బోధనలను వారు విస్మరించారు. అప్పుడు మేము చెడును అరికట్టేవారిని రక్షించి, దుర్మార్గులయిన వారినందరినీ వారి అత్యాచారం మూలాన కఠోర యాతనకు గురిచేశాము.

ఏ (దుష్) కార్యాలను నిషేధించటం జరిగిందో వారు వాటిని తలబిరుసుతనంతో చేస్తూ ఉండటం చేత మేము వారిని "నీచమయిన కోతులు కండి" అని శపించాము.

-: సమాప్తం :-